ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నందికొట్కూరు ఎంఈవోపై వేటు

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్, ఆగస్టు 20 : విద్యాశాఖ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన నందికొట్కూరు ఎంఈవో ఫైజున్నిసా బేగంపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఆర్జేడీ శ్యామ్యూల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 7వ తేదీ రాత్రి 9 గంటలకు అధికారులు నిర్వహించిన వెబ్ ఎక్స్ సమావేశానికి ఆమె గైర్హాజరయ్యారు. మరుసటి రోజు ఉదయం 10 గంట లు దాటినా కూడా విధులకు హాజరు కాకపోవడంతో క్రమ శిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ వేటు వేస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు.

జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయం



వీబీఆర్‌కు జలకళ

- వెలుగోడు జలాశయంలో భారీగా నీటి నిల్వలు
- ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- జలాశయం వద్ద సందర్శకుల తాకిడి

ఆత్మకూరు, ఆగస్టు 20:


కృష్ణమ్మ పరవళ్లతో తెలుగుగంగ పథకంలో భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది. కొద్ది రోజులుగా వెలుగోడు జలాశయానికి నిరంతరంగా వరద వచ్చి చేరుతోంది. దీంతో ఇన్‌ఫ్లో ఆధారంగా ఎప్పటికప్పుడు ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. వాస్తవానికి 1983లో తెలుగుగంగ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రారంభించగా 1996లో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయింది. శ్రీశైల జలాశయం వెనుక తట్టు జలాలను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా బానకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ మీదుగా వీబీఆర్ జలాశయానికి విడుదల చేశారు. వీబీఆర్‌కు చేరుకున్న జలాలను మద్రాస్ ప్రధాన కాల్వ ద్వారా తమిళనాడు ప్రజలకు తాగు నీటి కోసం, రాయలసీమ ప్రాంత రైతాంగానికి సాగు నీరు అందించేలా తెలుగు గంగ పథకాన్ని రూపొందించారు. ప్రత్యేకించి ఈ పథకం ద్వారా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలో సుమారు 2.60 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. అలాగే జలాశయంలో నీటి నిల్వలు అధికంగా నమోదైనప్పుడు స్పిల్‌వే గేట్లను తెరిచి గాలేరు నదిలోకి నీటిని విడుదల చేస్తారు. ఈ నీటి ప్రవాహం నిప్పుల వాగు మీదుగా కుందూ నదిలో కలిసి ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలుగుగంగ పథకానికి అత్యంత కీలకమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణమై 28 ఏళ్లు అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో మాత్రమే ప్రాజెక్ట్‌కు గరిష్ట స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతోంది. 2009లో జిల్లాలో సంభవించిన భారీ వరదల సమయంలో కూడా రిజర్వాయర్‌కు గరిష్ట స్థాయిలో వరద నీటి ప్రవాహం నమోదు కాలేదు. అయితే 2017 అక్టోబరులో ఎగువ రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు చేరడంతో వెలుగోడు జలాశయం గరిష్ట స్థాయిలో 16.95 టీఎంసీల నీటిని నమోదు చేసుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే ఎగువ రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరడంతో జూలై 28 నుంచి వీబీఆర్‌కు నీటిని విడుదలను ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు నిరంతరం వీబీఆర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌లోకి గరిష్ట స్థాయికి చేరువలో నీటి నిల్వలు నమోదు కావడం విశేషంగా చెప్పవచ్చు.

వీబీఆర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైల జలాశయం వెనకతట్టు జలాలను తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు చేర్చడంతో జలాశయం గరిష్ట నీటి సామర్థ్యం 14.49 టీఎంసీల గాను మంగళవారం సాయంత్రానికి 12.500 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 11,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా వీబీఆర్ నుంచి మద్రాస్ ప్రధాన కాల్వకు ఐదు వేలు క్యూసెక్కులు, గాలేరు నదికి ఐదు వేల క్యూసెక్కులు, ఎస్ఆర్ కాల్వకు 50 క్యూసెక్కులు, ఎస్ఎల్ కాల్వకు 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి పథకానికి 10 క్యూసెక్కుల చొప్పున మొత్తం 10,090 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. కాగా జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండటంతో ఆయకట్టు పంట పొలాల్లో రబీ సీజన్‌లో కూడా రైతులు విస్తారంగా వరి సాగు చేశారు. అలాగే వెలుగోడు, ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాల ప్రజలకు కూడా తాగునీటి ఎద్దడి తీరే అవకాశం లేకపోలేదు. ఇదిలావుంటే జలకళతో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయాన్ని వీక్షించేందుకు సందర్శకులు అధికంగా తరలి వస్తున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన ప్రాజెక్ట్ కావడంతో శ్రీశైలం - మహానంది క్షేత్రాలకు వెళ్లే పర్యాటకులు మార్గమధ్యంలో ఉన్న వీబీఆర్ జలాశయాన్ని సందర్శించి సందడి చేస్తున్నారు. వాహనాలను నేరుగా మట్టికట్టపైకి తీసుకెళ్లి అక్కడ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.


తెలుగుగంగ పథకం పైలాన్





వెలుగోడు జలాశయం వద్ద సందర్శకుల తాకిడి

స్పిల్‌వే ద్వారా నీటి విడుదల



ప్రణాళికాబద్ధంగా నీటి నిల్వలు నమోదు చేస్తున్నాం

వెలుగోడు జలాశయానికి సుమారు 24 రోజులుగా నిరంతరంగా వరద కొనసాగుతోంది. జలాశయంలోకి చేరే ఇన్‌ఫ్లో బట్టి ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు నమోదు చేస్తున్నాం. జలాశయం పరివాహక ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ గరిష్ట నీటి సామర్థ్యం 19.695 టీఎంసీలు ఉన్నప్పటికీ ప్రస్తుతం 14.5 టీఎంసీల వరకు మాత్రమే నీటి నిల్వలు ఉంచాలని నిర్ణయించాం. ఎందుకంటే వరద ప్రవాహంతోపాటు వర్షాల నీరు జలాశయంలో వచ్చి చేరితే గరిష్టస్థాయి కంటే అధికంగా నీటి నిల్వలు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలతో నీటి నిల్వలు నమోదు చేస్తున్నాము. అదేవిధంగా సిద్దాపురం ఎత్తిపోతల పథకానికి నీటిని పంపింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ విద్యుత్ కేబుల్ సమస్య కారణంగా పంపింగ్ జరగడం లేదు. సమస్య పరిష్కారమైన వెంటనే సిద్దాపురం చెరువుకు నీటి విడుదల చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

- శివనాయక్, తెలుగుగంగ పథకం ఏఈఈ, నంద్యాల

ఇక విజిబుల్ పోలీసింగ్ : ఎస్పీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 20 : శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ముఖ్య కూడళ్లలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ట్రాఫిక్, మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ట్రిపుల్ రైడింగ్, నెంబర్ ప్లేట్, సరైన రికార్డులు, హెల్మెట్ లేని వారిని గుర్తించడం మొదలైన వాటికి జరిమానా విధిస్తామని అన్నారు. అలాంటి వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు సూచించేలా హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తామని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంలాంటి వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

కళాశాలల్లో అవగాహన : జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు 22 బృందాలుగా ఏర్పడి 51 వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీపై వంట చేసే వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణ, ఈవిటీజింగ్‌కు అడ్డుకట్ట, మహిళలపై జరిగే నేరాలపై కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వంద రోజుల ప్రణాళికా లక్ష్యాలను సాధించండి: కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 20: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి నిర్దేశించిన లక్ష్యాలను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో వంద రోజుల ప్రణాళిక అమలు తీరుపై ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, హౌసింగ్ తదితర ఇంజనీరింగ్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 20 లక్షల మంది జనాభా ఉంటే అన్ని కేటగిరీల సిబ్బంది కలిపి 20 వేల మంది పని చేస్తున్నారని అన్నారు. జిల్లాలో అపారమైన వనరులు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకొని జిల్లాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలో జరిగే ప్రతి యాక్టివిటీ ఎంపీడీవోల ద్వారానే జరగాలని ప్రజల అవసరాలను గుర్తించి వంద రోజుల ప్రణాళికలో చేపట్టిన అంశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రతి రోజూ కనీసం రెండు ఇండ్ల నిర్మాణం పూర్తి చేస్తూ పురోగతి సాధించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 20: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాల నుంచి 36,366 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 53,748 క్యూసెక్కులు మొత్తం 90,114 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 881.80 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 197.9120 టీఎంసీలు నమోదయింది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,328 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

భూ అక్రమార్కులను వదలకండి

రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి బీసీ



రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి

కొలిమిగుండ్ల, ఆగస్టు 20: వైసీపీ హయాంలో భూ అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరినీ వదలిపెట్టకూడదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని మంత్రి స్వగృహంలో నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, కొలిమిగుండ్ల తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, రెవెన్యూ అధికారులతో మంత్రి బీసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొలిమిగుండ్ల మండలంలో జరిగిన ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణపై మంత్రి ప్రస్తావించారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి, దోచుకున్నారని, వారికి కొందరు అధికారులు కూడా సహకరించారన్నారు. ఈ అక్రమాల్లో వీఆర్వో, సర్వేయర్లపైనే కాకుండా వారితో తప్పులు చేయించిన ఉన్నతాధికారులు, నాయకులపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అవినీతిని ఉపేక్షించదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొలిమిగుండ్ల మండల కేంద్రంలో ఇళ్ల స్థలాల విషయంలో నిబంధనలు గాలికి వదిలారని తెలిపారు. ఇష్టానుసారంగా ఆక్రమణలు, స్థలాల అమ్మకాలు జరిగాయన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. వైసీపీ హయాంలో ప్రజా ప్రతినిధులే ఆక్రమణలు ప్రోత్సహించడం బాధాకరమన్నారు. ప్రజలపై ప్రేమ ఉంటే చట్టబద్ధంగా ఇంటి స్థలాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. వైసీపీ నాయకులు మాత్రం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి విక్రయించారన్నారు. వీటిపై కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి బీసీ అధికారులను ఆదేశించారు.

గాలివాన బీభత్సం

- పొంగిన వాగులు వంకలు
- నీట మునిగిన పంటలు



పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న పైరు

నందికొట్కూరు, ఆగస్టు 20 : గాలివాన బీభత్సం సృష్టించింది. ఓ వైపు ఎండుతున్న పైర్లకు ఈ వర్షం ఎంతో మేలు చేకూర్చగా అదే క్రమంలో గాలి హోరెత్తడంతో మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. సోమవారం రాత్రి గాలివాన బీభత్సానికి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అక్కడక్కడ మొక్కజొన్న పంట దెబ్బతింది. వాగులు వంకలు పొంగి పొర్లాయి.

రుద్రవరం సమీపంలోని మొక్కజొన్న పంటలో నిలిచిన వర్షం నీరు



రుద్రవరం: మండలంలో సోమవారం రాత్రి 66.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో ఒక్కసారిగా వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. నాగలవరంలో పసుపు మొక్కజొన్న పంటల్లో వర్షం నీరు నిలిచింది. రుద్రవరం, తువ్వపల్లె, రెడ్డిపల్లె, కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల పరిధిలో మొక్కజొన్న, మినుము, కంది పంటలు నీట మునిగాయి.



తంగడంచ పొలిమేరలోని పొలాలను ముంచెత్తి ప్రవహిస్తున్న పగిడిచర్ల వాగు

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో మొత్తం 67.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పారుమంచాల కాకిలేరు, ఇసుక వాగులు ఉప్పొంగి ప్రవహిచాయి. ఇసుక వాగుపై వంతెన పనులు పూర్తి కాకపోవడం, ప్రధాన రహదారిపై వర్షం నీరు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందికొట్కూరుకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు అవతలి వైపే నిలవడంతో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పారుమంచాల, తూడిచర్ల, మద్దూరు, వాడాల వైపు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పగిడిచర్ల వాగు ఉధృతితో తంగడంచ పొలిమేరలో కంది, మినుము పంటలు నీట మునిగాయి.

వైభవంగా పూర్వారాధన

- మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం
- స్వర్ణ పల్లకిపై విహరించిన రాఘవరాయలు
- సింహ వాహనంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- కొనసాగుతున్న రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి



శ్రీరాముడి విగ్రహం ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, శ్రీమతం అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 20: జయహో గురు రాఘవేంద్రా.. విజయహో అంటూ దేశ నలుమూలల నుంచి అశేష భక్తజనవాహిని తరలివచ్చి మంత్రాలయంలో తరించారు. రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి బృందావనాన్ని ప్రహ్లాదరాయల రూపంలో అలంకరణ చేసిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బంగారు పల్లకిపై రాఘవేంద్రులను ఊరేగింపు నిర్వహించారు. తమిళనాడులోని శ్రీరంగంలోని రంగనాథస్వామి దేవస్థానం నుంచి ప్రధాన అర్చకులు అధికారికంగా స్వామివారికి పట్టువస్త్రాలు బృందావనానికి సమర్పించారు. సింహ వాహనుడైన ప్రహ్లాదరాయలు చెక్క, వెండి, నవరత్నాల రథాలపై అధిష్ఠించగా.. పీఠాధిపతి మహామంగళహారతులు ఇవ్వగా రథాలు ముందుకు సాగాయి. భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో మంత్రాలయం మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ ప్రధాన రహదారులు భక్తులతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్. గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీనివాస్ ఖస్గే, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, పూజారి వ్యాస రాజాచార్, సూపరింటెండెంట్ రవి కులకర్ణి, స్కెచ్ రాఘవేంద్ర, విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ప్రహ్లాదరాయల దర్శనం

ఆకట్టుకున్న దాసవాణి సాహిత్యం : పూర్వారాధనలో భాగంగా యాగశాలలో యూఎస్ఏ చెందిన ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత విద్వాన్ రిత్విక్, సూర్య ఉపాధ్యాయులచే నిర్వహించిన దాసవాణి సాహిత్యం భక్తులకు ఆకట్టుకుంది. మైసూరు చెందిన అంబ్రూని గురుకుల్‌కు చెందిన చిన్నారులచే పాటలు అలరించాయి.

రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డుల ప్రదానం

మంత్రాలయం, ఆగస్టు 20: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో రాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డులను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రదానం చేశారు. బెంగుళూరుకు చెందిన బీజీఎస్, ఎస్‌జేబీట్ గ్రూప్స్ ఆఫ్ ఇండస్ట్రీస్, హాస్పిటల్స్ అధినేత ప్రకాశానంద స్వామీజీ, బెంగుళూరుకు చెందిన రఘుపతి ఉపాధ్యాయ, వారణాసికి చెందిన ప్రొఫెసర్ వ్రజ భూషణ్‌లకు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా రూ.లక్ష నగదు, వెండి ప్లేటు, గిన్నె, బంగారు చైన్, రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ పంచముఖి, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశానంత స్వామీజీకి అవార్డును అందజేస్తున్న పీఠాధిపతి

నేటి ఉత్సవాలు: రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యారాధన ఉత్సవం జరగనుంది. ఈ సందర్భంగా టీటీడీ నుంచి అధికారికంగా పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. సాయంత్రం ప్రహ్లాదరాయలు గజవాహనంపై దర్శనమిస్తారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న యూఎస్ఏకి చెందిన రిత్విక్



మూలరాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

హంద్రీలో ఇసుక దిబ్బల పరిశీలన

● విచారణ చేసిన మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్

గోనెగండ్ల, ఆగస్టు 20: గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామ పరిధిలోని హంద్రీ నదిలో (గాజులదిన్నె ప్రాజెక్టు మునక భూమి)ని ఇసుక దిబ్బలను మంగళవారం మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆయన సిబ్బంది, స్థానిక రెవెన్యూ ఉద్యోగులు పరిశీలించారు. హంద్రీ నదిలోని ఇసుకను ప్రభుత్వ అనుమతి లేకుండా అధికార పార్టీ నాయకులు అక్రమంగా తరలిస్తున్నారని గంజహళ్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గంజల్లయ్య, కొంతమంది గ్రామస్థులు సోమవారం కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి మంగళవారం విచారణ చేసి నివేదిక ఇవ్వాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తన సిబ్బందితో గంజహళ్లి గ్రామ హంద్రీ నదిని పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని రాజశేఖర్ తెలిపారు.

ఆసుపత్రిలో మౌలిక వసతులు సమకూరుస్తాం

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: నంద్యాలలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతులను సమకూరుస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ కమిటీతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకుకు అవసరమైన రెఫ్రిజిరేటర్ సెంట్రీ ఫ్యూజ్, డిస్టిల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైద్యశాలలో అవసరమైన పరికరాలను అందజేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద రావు, హెచ్‌వోడీలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోడ కూలి మహిళ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

వెలుగోడు, ఆగస్టు 20: వెలుగోడు పట్టణంలో గోడ కూలి ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెలుగోడు పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో హనుమన్న, మద్దమ్మలు తమ ఇద్దరు కుమారులు, కోడళ్లతో నివాసం ఉంటున్నారు. వారు రాఖీ వేడుకలను జరుపుకుని రాత్రి ఇంటి ముందు రేకుల షెడ్డులో నిద్రించారు. గోడ కూలడంతో షెడ్డులో నిద్రిస్తున్న మద్దమ్మ(50) అక్కడికక్కడే మృతి చెందింది. హనుమన్న, రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో కుమారుడు గిడ్డయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. రాఖీ పండుగ ఉండటంతో పెద్ద కోడలు అంజనమ్మ, ఆమె పిల్లలు జనార్దన్, రూప పుట్టింటికి వెళ్లడంతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడ్డ రామాంజనేయులు, హనుమన్నలను వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. అలాగే వెలుగోడు పట్టణంలోని కొమ్ముపాలెంకు చెందిన పొదిలి ఎస్తేరమ్మ ఇంటి గోడ కూలింది. ఇంట్లోని వస్తువులు మట్టి కింద కూరుకుపోయాయి.



మృతి చెందిన మద్దమ్మ

మరణంలోనూ వీడని బంధం

భర్త మృతి జీర్ణించుకోలేక భార్య మృతి

బండిఆత్మకూరు, ఆగస్టు 20 : ఒకరి తరువాత ఒకరు కొన్ని గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు ప్రాణాలు వదిలిన హృదయ విదారక ఘటన బండిఆత్మకూరు మండలంలోని వెంగళరెడ్డిపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల చిన్న తిరుపాల్(68) మంగళవారం ఉదయం 9 గంటలకు మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు అతని మృతదేహాన్ని బంధువులు శ్మశానానికి తరలిస్తూ గ్రామం దాటక ముందే భార్య అక్కమ్మ(65) ప్రాణాలు వదిలారు. భర్త మృతిని జీర్ణించుకోలేక అక్కమ్మ ఉదయం నుంచి రోదించింది. ఈ క్రమంలో భర్త మృతదేహాన్ని తీసుకెళ్తుండగా భార్య కుప్పకూలి మృతి చెందింది. దీంతో వెంగళరెడ్డిపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు భార్యాభర్తల మృతదేహాలను శ్మశానానికి తరలించి ఒకరి పక్కన ఒకరికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్న చిన్న తిరుపాల్, అక్కమ్మ దంపతులకు ఐదుగురు కొడుకులు ఉన్నారు.



చిన్న తిరుపాల్, అక్కమ్మ (ఫైల్)

బొలేరో బోల్తా.. రైతు మృతి

దేవనకొండ, ఆగస్టు 20 : కూరగాయలు తరలిస్తున్న బొలేరో వాహనం టైరు పగిలి అదుపు తప్పడంతో ప్రమాదానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కర్నూలు-బళ్లారి రహదారిపై గద్దెరాళ్ల బస్‌స్టేజీ సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకొంది. పత్తికొండ మండలం జూటూరుకి చెందిన ఐదుగురు రైతులు తాము పండించిన కూరగాయలను కర్నూలు మార్కెట్‌కు తరలిస్తుండగా వాహనం వెనకాల టైరు పగిలిపోయింది. ప్రమాదంలో మధు, రాజు, లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో కోడుమూరుకు తరలిస్తుండగా తీవ్రంగా గాయపడిన రైతు మధు(42) మృతి చెందాడు.

వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: నంద్యాలలోని నూనెపల్లె రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన చంద్రబాబు (29) కుటుంబ కలహాలతో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బ్రిడ్జి పై నుంచి దూకి రైల్వే ట్రాక్‌పై పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన చంద్రబాబును స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవలకు కర్నూలుకు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతు కష్టం దొంగలపాలు

బైక్ నుంచి రూ.2 లక్షలు తస్కరించిన వైనం

ఎమ్మిగనూరు, ఆగస్టు 20: ఓ రైతు కష్టం దొంగలపాలైంది. బైక్‌లో ఉంచిన రూ. 2లక్షలు చోరీకి గురైన ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు తన కున్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని కౌలుకు తీసు కొని పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నాడు. గత ఏడాది పండించిన మిరప పంటకు సరైన ధర లేకపోవటంతో కర్నాటకలోని బ్యాడిగి మార్కెట్ దగ్గర ఏసీ గోడౌన్‌లో నిలువ చేశాడు. రెండు వారాల క్రితం ఏసీ గోడౌన్‌లో నిలువ చేసిన మిరపను విక్రయించాడు. దీంతో రూ.2 లక్షల 40వేలు వచ్చాయి. వ్యాపారులు రూ.40 వేలు చేతికిచ్చి మిగతా రూ.2 లక్షలు రైతు రామాంజనేయులు బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ మొత్తాన్ని రైతు రామాంజనేయులు సోమవారం డ్రా చేసుకునేందుకు ఎమ్మిగనూరుకు వచ్చాడు. స్థానిక గాంధీనగర్‌లో ఉన్న కార్పొరేషన్ బ్యాంకులో డబ్బును డ్రా చేసుకుని డబ్బును తన మోటార్‌సైకిల్ ట్యాంకు కవర్‌లో పెట్టుకున్నాడు. పక్కనే ఉన్న బేకరి దగ్గరకు వచ్చి బైక్ నిలిపి బ్రెడ్ తీసుకోవాలని అటు వైపు తిరిగాడు. బ్రెడ్ లేదని దుకాణం నిర్వాహకులు చెప్పడంతో తిరిగి బైక్ దగ్గరకు వచ్చాడు. అప్పటికే దొంగలు ట్యాంకు కవర్‌లో ఉన్న రూ. రెండు లక్షల నగదును దోచుకెళ్లారు. దీంతో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



రామాంజనేయులు

భార్యే చంపేసింది..?

● ఆస్తి కోసమే గొంతు కోసిన వైనం

● కొలిక్కి వచ్చిన సారా వ్యాపారి హత్య కేసు

ఆదోని రూరల్, ఆగస్టు 20 : మద్యం మత్తులో ఉన్న భర్త గొంతు కోసి భార్య హతమార్చింది. పైగా తన భర్తను ఎవరో చంపేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల విచారణలో అసలు విషయం బైటపడింది. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఉప్పరి శేకన్న(50) హత్య చుట్టూ ఉన్న వివాదాన్ని పోలీసులు ఛేదించారు. శేకన్నకు జయమ్మ, గంగమ్మ ఇద్దరు భార్యలు. ఇతనికి మూడెకరాల పొలం, ఒక ఇల్లు ఉన్నాయి. శేకన్న అక్రమ సారా, కర్ణాటక మద్యం వ్యాపారం చేస్తు న్నాడు. ఇప్పటికే ఆయన గ్రామంలో ఉండే ఇంటికి తాకట్టు పెట్టాడు. రెండో భార్య ప్రవర్తనపై అనుమానంతో ఆమెను వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య జయమ్మ ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న శేకన్నతో మూడెకరాల పొలంలో రెండెకరాల పొలాన్ని తనకు రాసి ఇవ్వాలని కోరింది. తన పేరుపై ఉన్న ఇంటిని ఎందుకు తాకట్టు పెట్టావని గొడవకు దిగింది. ఇప్పటికే రెండో భార్య గంగమ్మతో వివాదంతో సతమతమవుతున్న శేకన్న మొదటి భార్య ఆస్తి కావాలని వేధించడంతో తట్టుకోలేక జయమ్మను కొట్టాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న భర్త గొంతును కొడవలితో జయమ్మ కోసి హత్య చేసింది. ఆ తర్వాత భర్తను ఎవరో చెప్పారంటూ చుట్టు పక్కల వారికి తెలిపింది. డీఎస్పీ సోమన్న, సీఐ నల్లన్న, ఎస్.ఐలు నాగేంద్ర, శ్రీనివాసులు, రామాంజనేయులు ఘటన స్థలానికి చేరుకొని అనేక కోణాల్లో విచారణ చేపట్టగా, మొదటి భార్య జయమ్మ నిందితురాలని తేలింది. ఆమెను అదుపులో తీసుకున్నారు. హత్య ప్రదేశంలో లభ్యమైన గాజులను, హత్య చేయడానికి ఉపయోగించిన కొడవలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జయమ్మను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

KURNOOL URBAN DEVELOPMENT AUTHORITY (K.U.D.A), KURNOOL.

హెచ్చరిక / పబ్లిక్ నోటీసు

నంద్యాల జిల్లా పరిధిలోని ప్రజలకు తెలియజేయడము ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లేఅవుట్లు వేసియున్నారు.

క్ర. సం.	అనధికార లేఔట్ పేరు / లేఔట్ యజమాని/ డెవలపర్ పేరు	విస్తీర్ణము (ఎకరాలు)	సర్వే నెంబరు	గ్రామము	మండలం
1	ఇలియాస్	1.50	470	అయ్యలూరు	నంద్యాల
2	చిట్టిపురాజశేఖరరెడ్డి	1.28	245/2C	చాబోలు	నంద్యాల
3	బొగ్గిటిమార్క్	2.53	246/3A	చాబోలు	నంద్యాల
4	రంగప్పగారి నరసమ్మ/మదర్సా	2.50	29	చాబోలు	నంద్యాల
5	నందా వెంకటేశ్వర్లు	1.00	992, 993/A	కానాల	నంద్యాల
6	నందా వెంకటేశ్వర్లు	3.00	1143	కానాల	నంద్యాల
7	శ్రీ మురళీకృష్ణారెడ్డి వెంకటరామిరెడ్డి	5.00	414	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
8	శ్రీ డి నాగయ్య హుస్సేన్బీరా	2.00	329	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
9	శ్రీ యస్ మహబూబ్ బాషా న్యూ రాయల్ టౌన్షిప్	12.00	72(P)	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
10	శ్రీయస్ శ్రీనివాసరెడ్డి అయ్యన్నరెడ్డి	5.00	94(P)	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
11	శ్రీ వెంకటరమణ	16.00	686 TO 691, 714 TO 720, 726 TO 730,	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
12	శ్రీ దేవగుడి చిన్నరెహమాన్ డి ఇమాంహుస్సేన్	2.00	661/B,751, 752/A1A	ఆళ్లగడ్డ మునిసిపాలిటీ	ఆళ్లగడ్డ
13	కాకనూరు అబ్దుల్ ఖాదిర్ మరియు ఇతరులు	5.33	31/2,45/B, 49,50	వెలుగోడు	వెలుగోడు
14	టి రవికుమార్	2.5	683	80 బన్నూర్	జూపాడుబంగ్లా
15	మేదిరిగుడికంటి సోమనాథ్	3.6	1-2A	తంగెడంచ	జూపాడుబంగ్లా
16	ఇ మనోహర్‌రెడ్డి, ఇ శివనాగిరెడ్డి	2.0	326-1A2	ప్యాపిలి	ప్యాపిలి
18	బి రవీంద్రారెడ్డి & బి ప్రకాష్‌రెడ్డి	2.76	326-1A1	ప్యాపిలి	ప్యాపిలి
19	అరుణజ్యోతి కుమ్మరి కేషన్న	1.0	330-1	ప్యాపిలి	ప్యాపిలి
20	రఘునాథరెడ్డి	1.16	266/1, 2,3,4	కలచట్ల	ప్యాపిలి
21	ఎండ రామాంజనేయులు	2.48	243/A2, 244/2	కలచట్ల	ప్యాపిలి
22	శేషపని భాష్కర్‌రెడ్డి	1.18	244-1	కలచట్ల	ప్యాపిలి
23	బత్తుల సాకేత్‌రెడ్డి	5.0	185	కలచట్ల	ప్యాపిలి
24	జి రాముడు	3.27	114-CC2	జగదుర్తి	డోన్
25	జి.శ్రీనివాసులు	2.78	124-B1	జగదుర్తి	డోన్
26	బి.మనోహర్ & డి మహబూబ్ బాష	3.32	30-1	జగదుర్తి	డోన్
27	ఎస్.రజనీకాంత్ & యం.రాజు	4.2	165-6A1, A2, A3, A4	జగదుర్తి	డోన్
28	డి.శ్రీనివాసులు	3.0	167-A1, 168-1	జగదుర్తి	డోన్
29	ఈ.వెంకటేష్‌గౌడ్ & ఈ.రాముడు	1.0	114-D1	జగదుర్తి	డోన్
30	జి.జయరాముడు	1.58	123-B2B2	జగదుర్తి	డోన్
31	బి.బాలహుస్సేన్	2.12	133-B3	జగదుర్తి	డోన్
32	జి.క్రిష్ణన్న జి.లక్ష్మీదేవి జి.వెంకటరమణ	3.47	25-A1B1	జగదుర్తి	డోన్
33	గద్దం సురేష్, జి.స్వాములు	1.54	231-A&B	ఉడుములపాడు	డోన్
34	ఎం.శ్రీదేవి	9.0	304	కదుమూరు	మిడుతూరు
35	గద్దె నాగన్న	2.06	183/2F , 184/2	పసురపాడు	గోస్పాడు
36	యూనుస్	1.81	10/2	కృష్ణాపురం	ఆత్మకూరు
37	ఐ.రంగనాయకులు (విశాల్)	3.18	220-1	కరివేన	ఆత్మకూరు
38	రమణయ్య	1.5	331-2	కరివేన	ఆత్మకూరు
39	ఎ సలాం	1.5	83/B, 83/C	కరివేన	ఆత్మకూరు
40	ఎ సలాం	2	268	కరివేన	ఆత్మకూరు
41	సదుల విశ్వనాదరెడ్డి	4.02	47	బనగానపల్లె	బనగానపల్లె
42	నక్కా విజయుడు	1	17	బనగానపల్లె	బనగానపల్లె
43	కప్పేట్రు సుబ్బారెడ్డి	2	19	బనగానపల్లె	బనగానపల్లె
44	బొల్లవరం రామచంద్రారెడ్డి	2.3	18	బనగానపల్లె	బనగానపల్లె
45	బీ.జయచంద్రారెడ్డి	3.56	20.5	బనగానపల్లె	బనగానపల్లె
46	అప్తాబ్ హమీద్	2.5	153/2B	బనగానపల్లె	బనగానపల్లె
47	శ్రీనివాసరెడ్డి	9.4	69	బనగానపల్లె	బనగానపల్లె
48	కోళ్లపారం సుబ్బయ్య	2.9	148	ఎనకండ్ల	బనగానపల్లె
49	నూకల వెంకటసుబ్బయ్య	3.31	143/3, 143/1C	ఎనకండ్ల	బనగానపల్లె
50	ఇస్మాయిల్ ఖాన్	1	42/1	మిట్టపల్లి	బనగానపల్లె
51	వై.సుబ్బారాయుడు	4	68	మిట్టపల్లి	బనగానపల్లె
52	ఖాసీం బాబు	1.5	76	మిట్టపల్లి	బనగానపల్లె
53	ఇస్మాయిల్ ఖాన్	1	73	మిట్టపల్లి	బనగానపల్లె
54	నూకల వెంకటసుబ్బయ్య	4.33	181/2, 181/3	ఎనకండ్ల	బనగానపల్లె
55	జి.వేణుగోపాల్	2.81	159P, 160P	బానుముక్కల	బనగానపల్లె
56	చిందుకూరు పద్మావతి వేములపాడు సుబ్రమణ్యం	3.25	327P	భానుముక్కల	బనగానపల్లె
57	నూకల విశాలాక్షి	1.3	72/3	యెర్రగుడి	బనగానపల్లె
58	కారణం అబ్దుల్ రజాక్	2.35	89P, 88P	మిట్టపల్లి	బనగానపల్లె
59	జి.వేణుగోపాల్, జి.మోహన్, జి.సుబ్బారాయుడు	2.51	126P	ఎనకండ్ల	బనగానపల్లె
60	పీ నైటిద్దీన్, మహబూబ్ బాష	1.44	192/2A	బనగానపల్లె	బనగానపల్లె
61	ఏరుపాల్ రెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీకామేశ్వరి	5.38	122/1	బనగానపల్లె	బనగానపల్లె
62	కాశీంబాబు, తమ్మరాజు	1.23	148/3A	బనగానపల్లె	బనగానపల్లె
63	నూకల వెంకటసుబ్బయ్య	1.77	198/1	బనగానపల్లె	బనగానపల్లె
64	ఎస్.సుబ్బయ్య విజయవర్ధిరెడ్డి	5.65	106	మిట్టపల్లి	బనగానపల్లె
65	కమ్మితి బాలరోషిరెడ్డి, రాజేశ్వరమ్మ	1.26	69/2E	మిట్టపల్లి	బనగానపల్లె
66	చిత్రపురెడ్డి మల్లికార్జునరెడ్డి	5.77	58/2A	బనగానపల్లె	బనగానపల్లె
67	నంద్యాల చిన్నా	3.8	250	బనగానపల్లె	బనగానపల్లె
68	పెద్దరాజుపాలెం భూసి	2.37	248	భానుముక్కల	బనగానపల్లె
69	సయ్యద్ మహమ్మద్ బాష ఈసారి ఎల్లయ్య	2.98	328/3B	మిట్టపల్లి	బనగానపల్లె
70	షేక్ షబ్బార్ హుస్సేన్	6.02	321, 321/4	భానుముక్కల	బనగానపల్లె
71	అబ్దుల్ షకూర్, వై సుబ్బారెడ్డి	6.55	129	భానుముక్కల	బనగానపల్లె
72	నాగళ్ల సులోచనదేవి	4	250P, 251P	భానుముక్కల	బనగానపల్లె
73	ప్రభాకర్‌రెడ్డి	3.54	104P	మిట్టపల్లి	బనగానపల్లె
74	ఎస్.సాంబశివారెడ్డి, వై బుచ్చిరెడ్డి	2	105P	మిట్టపల్లి	బనగానపల్లె
75	ఎం శంకర్‌రెడ్డి	2	71(P)	మిట్టపల్లి	బనగానపల్లె
76	నూకల వెంకటసుబ్బయ్య	8	207(P)	బనగానపల్లె	బనగానపల్లె
77	NA	3.2	165P, 168P	భానుముక్కల	బనగానపల్లె
78	NA	2.86	177(p)	భానుముక్కల	బనగానపల్లె
79	రమేష్	2.2	46(p), 91(p)	ఏళ్లురుకొత్తపేట	బనగానపల్లె
80	NA	1.55	323P	బానుముక్కల	బనగానపల్లె
81	NA	6.21	244P	బానుముక్కల	బనగానపల్లె
82	చింతానాగిరెడ్డి	0.8	435/2	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
83	ఆర్.జూలకంటి రెడ్డి	0.6	496/2	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
84	సయ్యద్‌మహ్మద్‌గౌస్	1	434/3	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
85	దివాకర్‌రెడ్డి	0.98	484/3	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
86	వి.వెంకటమోహన్‌బాబు	3.84	460/1, 460/2	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
87	దూదేకుల దస్తగిరి	2.51	476-A2, 477-2 478/2, 478/1	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
88	బి.మధు	0.68	851/1	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
89	కె. రామలింగేశ్వర రెడ్డి	1.8	499/2A, 499/3A 524/1, 525/1A 434/2D	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
90	డి.వెంకటేశ్వర్లు	0.32	271/1C	ఆర్.ఎస్.రంగాపురం	బేతంచెర్ల
91	బుగ్గన అనసూయమ్మ	1	451,452, 487/2, 488,490	బేతంచెర్ల	బేతంచెర్ల
92	పింజరి భాష	0.5	502	బేతంచెర్ల	బేతంచెర్ల
93	నందవరం వెంకటేశ్వర్లు మంగళి వెంకట రమణ	1.5	485	బేతంచెర్ల	బేతంచెర్ల
94	బి.వి. సుబ్బరాయుడు	2.2	486	బేతంచెర్ల	బేతంచెర్ల
95	శీలం రాజేష్	2.9	183	బేతంచెర్ల	బేతంచెర్ల
96	మొల్ల రబ్బాని, మొల్ల జాకీర్	7.85	15A1, 15A2	బొల్లవరం	నందికొట్కూరు
97	హుస్సేన్ సహెబ్	4.0	11/3	బొల్లవరం	నందికొట్కూరు
98	జానకి రాజశేఖరప్ప	1.47	246/1, 117/1	బొల్లవరం	నందికొట్కూరు
99	ఎం.ఎస్ నూర్ బాషా	0.5	352, 358	కౌలురు	పాణ్యం
100	కె.వెంకటసుబ్బయ్య మల్లికార్జునరెడ్డి	1.4	122	కౌలురు	పాణ్యం
101	ఎస్.రమణారెడ్డి	4.98	129, 130	కొనిదేడు	పాణ్యం
102	జి.హుస్సేన్ బాషా	2.44	216	పాణ్యం	పాణ్యం

కావున పైన తెలియపరచిన లేఅవుట్ల నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లకు అమ్మకము, కొనుగోలుకు వీలులేకుండా రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధించబడతాయి మరియు ఎటువంటి భవననిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంటు, నీరు, డ్రైనేజి సదుపాయాలు కల్పించబడవు. దీనిని గమనించవలసినదిగా విజ్ఞప్తి.

గమనిక : అనధికారముగా లేఅవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానులు లేదా డెవలపర్లపైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

సం/- ఉపాధ్యక్షులు, కుడా, కర్నూలు.

గాలివాన బీభత్సం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- దెబ్బతిన్న పంటలు
- జలమయమైన రహదారులు





నందికొట్కూరు రూరల్: బొల్లవరం వద్ద వంతెన కింద, నందికొట్కూరు ఎంఈవో కార్యాలయ ఆవరణలో నిలిచిన వర్షం నీరు

నందికొట్కూరు, ఆగస్టు 20: నందికొట్కూరు పట్టణంలో మారుతి నగర్‌లో వర్షపు నీటితో డ్రైన్లు పొంగిపొర్లాయి. దీంతో రోడ్డుపైనే వర్షపునీటితో పాటు డ్రైనేజీ మురుగు నీరు కూడా ప్రవహించింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. ఆత్మకూరు రోడ్డులోని బైరెడ్డి శేషశయనారెడ్డి నగర్‌లో కూడా వర్షపు నీరు నిండుకుంది. మంగళవారం తెల్లవారుఝామున కురిసని వర్షానికి కొణిదేల, ముచ్చుమర్రి గ్రామల మధ్యలో వ్యవసాయ విద్యుత్ స్థంభాలు కిందపడ్డాయి. దీంతో ముచ్చుమర్రి, నందికొట్కూరుకు ఉదయం 9 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ జలమయమైంది. మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు భాస్కర్‌రెడ్డి, పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. నీటిని ఆసుపత్రి ఆవరణ నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అల్లాబకాష్, బాబు, ఖలీల్, కరీముల్లా, మా బాషా తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: బొల్లవరం గ్రామ సమీపంలో రైతులు పొలాలకు వెళ్లే నేషనల్ హైవే 340 అండర్ గ్రౌండ్ రహదారి నీటి మునిగింది. దీంతో రైతులు అటువైపుగా పొలాలకు వెళ్లాలంటే బ్రిడ్జి క్రిందనుండే వెళ్లాలి. కానీ జాతీయ రహదారి అధికారులు ఈ బ్రిడ్జిని అవగాహన లేకుండా నీరు నిలువవుండే ప్రదేశంలోనే నిర్మించారని రైతులు వాపోతున్నారు. అనాలోచితంగా నిర్మించడం వల్లే కొంచెం వర్షం పడ్డా ఈ రహదారి నీటిలో మునిగిపోయి రైతులను, కూలీలను బాగా ఇబ్బందులకు గురుచేస్తోందని అంటున్నారు. మండలంలో 73.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. పలు గ్రామాల్లో పంటలు, పైరులు నీటమునిగాయి.

పగిడ్యాల: మండలంలో గాలివానకు పలు గ్రామాల్లో రోడ్లు జలమయం కావడంతో పాటు తోతట్టు ప్రాంతాలలోని కాలనీలో వర్షపు నీరు ఇండ్లలోకి చేరుకుంది. మొక్కజొన్న, మినుము పంట పొలాలల్లో వర్షపు నీరు నిలిచింది. ముచ్చుమర్రి గ్రామంలో మొక్కజొన్న పంట గాలికి నేల కొరిగింది. మరో 20 రోజులలో పంట చేతికి వస్తుందన దశలో కురిసిన వర్షానికి పంట పూర్తిగా దెబ్బ తినడంతో తీవ్రంగా నష్టపోయ్యామని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నెహ్రూనగర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పలువురి ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ఇండ్లలో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలు, నిత్యవసర సరుకులు తడిసిపోయినట్లు బాధితులు తెలిపారు. మండలంలో 95.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో ఎల్లగౌడ్ తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలో బుధవారం తెల్లవారుఝామున భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా గంటకు పైగా వర్షం కురియడంతో 33.2మిమీల వర్షాపాతం నమోదైంది. దీంతో పట్టణంలోని ఏకలవ్యానగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, లక్ష్మీనగర్, గరీబ్‌నగర్, హుసేన్‌సానగర్, రహమత్‌నగర్ తదితర ఏరియాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదేవిధంగా పట్టణంలోని కప్పలకుంట, అప్పారావువీధి, ఫోస్టాఫీసు ఏరియా, కేజీ రోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో జనం అసౌకర్యానికి లోనయ్యారు. అలాగే ఆత్మకూరు శివార్లలోని పడేవాగు, భవనాశి నదిలో నీటి ప్రవాహం కొనసాగింది. అదేవిధంగా మండలంలోని పలు చెరువుల్లో కూడా నీటినిల్వలు పెరిగాయి.

వెలుగోడు: వెలుగోడు పట్టణ శివార్లలోని ఊట కాలువ మంగళవారం పొంగి ప్రవహించింది. ఊట కాలువ ఎల్లప్పుడు జీవనదిలా ప్రవహిస్తూ ఉంటుంది.దీనికి తోడు వర్షం కురవడంతో పొంగి పొర్లింది. ఊట కాలువ దాటేందుకు ఓ వ్యక్తి పైపులు వేసేందుకు తవ్వడంతో కాలువలో నీరు ప్రవహించలేక రోడ్డుపై నుంచి ప్రవహించింది. దీంతో పట్టణంలో నుంచి జమ్మినగర్ తాండా, గట్టుతాండా, అగ్గిరాజకుంటకు వెళ్లే ప్రజలు, పొలాలలకు వెళ్లే రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



ఆత్మకూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు



పగిడ్యాల: నెహ్రూనగర్‌లో ఇంటిలోకి చేరిన వర్షపు నీరు





వెలుగోడు మండలంలో పొంగి పొర్లుతున్న ఊట కాలువ, నిలిచిన వాహన రాకపోకలు



నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిలిచిన వర్షం నీటిని చూపుతున్న సీపీఎం నాయకులు

పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు: మంత్రి



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: టీడీపీకి కోసం పనిచేసిన కార్యకర్తలకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. టీడీపీ అఫీజియల్ యాప్‌ను విస్తృతంగా వినియోగించి టీడీపీ కార్యాక్రమాలను సమాచారాన్ని ప్రజలకు చేర వేయడంలో ముఖ్య పాత్ర పోషించి యాప్‌లో లక్షకు పైగా పాయింట్లు సాధించిన నంద్యాల నియోజక వర్గ టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు ప్రశంసాపత్రాలను మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ షేక్ హస్మద్దీన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నుంచి ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌గా ఎన్నుకోవడంపై మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు, ఉర్దూ పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ హస్మద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉర్దూ పాఠశాలలు, ఉర్దూ ఉపాధ్యాయులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

'పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి'

గడివేముల, ఆగస్టు 20: పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ప్రాంతీయ పశువైద్యులు, సహాయ సంచాలకులు కమలాకర్ సూచించారు. మండలంలోని బిలకలగూడురు గ్రామంలో జిందాల్ పరిశ్రమ, ఫార్మర్ ప్రొడ్యూజర్ కంపెనీ, నవయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 45 పశువులలో గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 20 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 120 పశువులకు గాలికుంటు టీకాలను వేశారు. అనంతరం పాడి రైతులకు పశువులకు అవసరమయ్యే మినరల్ మిక్షర్, మందులను పంపిణీ చేశారు.పశువైద్యులు పావని, హరిణి, సులోచన, బాబా పక్రుద్దీన్, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్‌ఏ రఫిక్, జయప్రతాప్‌రెడ్డి, జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

కొత్తపల్లి, ఆగస్టు 20: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. మంగళశారం కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు సీఐ మొదటిసారిగా సందర్శించారు. ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ సిబ్బంది సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో అక్రమ మద్యం, నాటుసారా పేకాటపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

ఆత్మకూరు, ఆగస్టు 20: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కార్మికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వేతనాలు పెంచాలని అన్నారు. అలాగే వర్కర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని అన్నారు. నాయకులు రజాక్, రామ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఆయుర్వేద వైద్యశాలలో తనిఖీలు



పాములపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తనిఖీ చేస్తున్న ఆర్డీడీ

పాములపాడు, ఆగస్టు 20: పాములపాడులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఆయుష్‌శాఖ, హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శేఖర్‌రాజ్ మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను వినియోగించకపోవడంపై ప్రశ్నించారు. సమయపాలన పాటించాలన్నారు. సీజన్ వ్యాధుల నివారణపై పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలని, గ్రామీణ ప్రజలకు ఆయుర్వేద మందుల ప్రాముఖ్యత వాటి పనితీరుపై తెలియచేయాలని వైద్యురాలు సావిత్రికి సూచించారు. ఆయుర్వేద వైద్యశాలలో ఐదుగురు ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉండగా ముగ్గురే ఉన్నారని, ప్రభుత్వం కొత్తగా నియామకాలు చేపట్టకపోవడంతో ఖాళీగా ఉన్నాయని ఆర్డీడీ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గోపిచంద్, వెలుగోడు ఆయుర్వేద వైద్యశాల వైద్యుడు డాక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన రేషన్ సరుకుల పరిశీలన



కడుమూరులో నివేదికను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

మిడుతూరు, ఆగస్టు 20: మండలంలోని కడుమూరు గ్రామంలో జూన్‌లో కురిసిన భారీ వర్షానికి అద్దె ఇంట్లో నిల్వ ఉంచిన 3, 4 రేషన్ షాపులకు చెందిన సరుకులు తడిసిపోయాయి. 50 కేజీల రేషన్ బియ్యం బస్తాలు 60, 50 కిలోల చక్కెల బస్తాలు 4 తడిసి ముద్దయ్యాయని వీఆర్వో నివేదిక పంపించారు. దీంతో వీటిని పరిశీలించడానికి నంద్యాల జేసీ విష్ణుచరణ్ మంగళవారం కడుమూరు గ్రామం చేరుకుని రేషన్ షాపును తనిఖీ చేశారు. తడిసిన బియ్యం బస్తాలను ఇచ్చిన నివేదిక ఆధారంగా జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఇచ్చిన నివేదిక ప్రకారం బియ్యం బస్తాలు తక్కువగా ఉన్నాయని డీలర్ కిశోర్, వీఆర్వో ఆంజనేయులును ప్రశ్నించారు. జేసీ వెంట డీఎస్‌వో వెంకట రమణ, తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్‌లు షానవాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

జీవిత బీమా పథకాలపై అవగాహన

పాములపాడు, ఆగస్టు 20: తపాలా జీవిత బీమా పథకాలపై విద్యార్థులకు పాములపాడు పోస్టుమాస్టర్ మనోజ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బీమా పథకాల గురించి వివరించారు ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ ప్రజల కోసం అందిస్తున్న వివిధ రకాల పథకాలను, సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది మనోహర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాణ్యం, ఆగస్టు 20: మండలంలో పాణ్యం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్‌రాజు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు బలపనూరు, పిన్నాపురం, సుగాలిమెట్ట, పాణ్యం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ శాఖ సహకరించాలని ఆయన కోరారు.

సీఐని కలిసిన నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 20: ఆత్మకూరు రూరల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కుమార్‌రెడ్డిని మంగళవారం కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, కౌన్సిలర్లు పార్వతీ, రంగస్వామి, నాయకులు మునీర్‌బాషా, కలిముల్లా తదితరుల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలుతవాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

మహానంది, ఆగస్టు 20: ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇవ్వకుండా జాప్యం చేస్తున్న ఒక వర్గంపై మరో వర్గం పరస్పర దాడులు చేసుకోవడంతో అందుకు కారణమైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహానంది మండలం ఎం.తిమ్మాపురానికి చెందిన సుభాన్, ఖరీమ్‌బాషా, భాజీ సాగు చేస్తున్న అరటి తోటలోని గెలలను రూ.1.50 లక్షలకు మండలంలోని శ్రీనగరం గ్రామానికి చెందిన దళారులు రామసుబ్బయ, షరీఫ్ అడ్వాన్సు ఒప్పదం ప్రకారం కొనుగోలు చేశారు. అయితే గెలలను మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాకా అంత ఇవ్వలేము రూ. 70 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడంతో రైతులు సుభాన్, ఖరీమ్ బాషా, భాజీ ఆగ్రహం చెందారు. ఉదయం శ్రీనగరంలో వారిపై ఘర్షణ పడ్డారు. ఇరువురు మహానంది పోలీస్‌స్టేషన్ చేరుకొన్నారు. వ్యవహారం సద్దుమణిగాక తిరిగి స్వగ్రామం వెళ్తున్న ముగ్గురు రైతులపై రాత్రి మండలంలోని బుక్కాపురం మెట్ట వద్ద అరటి కొనేగోలు చేసిన ధళారీలు తిరిగి ప్రతి దాడి చేసారన్నారు. ఇరు వర్గాలకు చెందిన వారికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్త నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

'నాణ్యమైన ఆహారం అందించాలి'

పాణ్యం, ఆగస్టు 20: వినియోగదారులకు నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలని నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకట్రాముడు, ఖాశీంవలి ఆదేశించారు. మంగళవారం ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల పరిధిలోని క్యాంటీన్‌లు, హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ హోటళ్లలో మిగిలిన ఆహారాన్ని నిల్వ ఉంచి వాడరాదన్నారు. ఎప్పటికప్పుడు వండిన వేడి ఆహారాన్ని అందించాలన్నారు. సింథటిక్ కలర్లను ఆహారాలలో వాడడం నిషేధమని తెలిపారు. న్యాచురల్ ఫుడ్ కలర్స్ వాడాలన్నారు. మాంసాహారాలు నిల్వ ఉంచరాదన్నారు. ఫ్రిజ్‌లో ఉంచిన ఆహారాన్ని వాడకూడదన్నారు. నిర్ణీత గడువు పూర్తయిన ఆహార పదార్థాలను వినియోగించరాదన్నారు. ప్రజల ఆరోగ్యానికి బాధ్యత వహించాలని ఆహార విక్రేతలను వారు కోరారు. జూనియర్ అసిస్టెంట్ రాముడు పాల్గొన్నారు.

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంగళవారం రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో విద్యార్థినులతో కలసి మహిళా వైద్యులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ నంద్యాల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధారాణి మాట్లాడుతూ.. దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, మేనేజర్ ప్రగతి రెడ్డి, ఐఎంఏ మహిళా వైద్యులు నర్మద, అరుణకుమారి, లక్ష్మి సౌజన్య తదిరతులు పాల్గొన్నారు.

'కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: నంద్యాల జిల్లా హెడ్ క్వార్టర్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నంద్యాల ముస్లిం జేఏసీ వ్యవస్థాపకుడు ఎన్ఎండీ లబుల్లైస్, గౌరవ సలహాదారు అతావుల్లా ఖాన్, కోకన్వీనర్లు, సామీల్ గఫార్, సద్దాం కోరారు. నంద్యాల ముస్లిం జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా జేఏసీ నాయకులు మంగళవారం కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణాను కలిసి వినతి పత్రాలు అందజేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. నంద్యాల పట్టణ జనాభా పెరిగి పోవడం, జిల్లా కేంద్రంగా మారడంతో వివిధ కేంద్ర సంస్థలకు సంబంధించిన ఉద్యోగుల కుటుంబాలు నంద్యాలలో స్థిర పడకపోవడంతో వారి పిల్లల గుణాత్మక విద్యను అందించే కేంద్రీయ విద్యాలయాన్ని నంద్యాలలో నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. పీఎం జేవీకే ద్వారా మంజూరైన ఆరు భవన సముదాయాలలో నాలుగింటిని మాత్రమే ప్రారంభించి స్లాబ్ లెవల్ వరకు నిర్మించారని అన్నారు. ముస్లిం మైనారిటీ పిల్లలు చదువుతున్న ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలకు భవనాలు లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే భవన సముదాయాల నిర్మాణ పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనియార్ ఖలీల్, మహబూబ్‌బాషా, అబ్దుల్ సలాం, జాకీర్ అలీఖాన్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లకు మరమ్మతులు చేయాలి'

నందికొట్కూరు, ఆగస్టు 20: నందికొట్కూరులోని 29వ వార్డులో గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలోని శేషశయనారెడ్డి నగర్, బైరెడ్డి నగర్‌లలోని రోడ్లు సరిగా లేక వర్షాకాలంలో గుంతలు పడి రోడ్డు మీద వెళ్తున్న వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురి అవుతున్నారని అన్నారు. కావున వార్డులోని రోడ్లను మరమ్మతులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వసతి గృహాల సందర్శన

మహానంది, ఆగస్టు 20: మండలంలోని తిమ్మాపురం కస్తూర్బా, మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాలను ఎస్ఐ రామోహ్మన్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా వసతి గృహాల్లోని విద్యార్థులతో సమస్యలపై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వార్డెన్‌లను ఆదేశించారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 20: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధారాణి, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ అధ్యక్షరాలు డాక్టర్ అరుణ కుమారిలు అన్నారు. మంగళవారం ఐఎంఏ, నంద్యాల మిషన్ పింక్ హెల్త్ సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నెసరి రుతుస్రావ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సదస్సు నిర్వహించారు. రుతు స్రావ సమస్యలపై డాక్టర్ అరుణ కుమారి, కౌమార బాలికలలో అండాశయ సమస్యలపై డాక్టర్ సునీత, థైరాయిడ్ సమస్యలపై డాక్టర్ స్ఫూర్తి బాలికలలో రక్త హీనత అంశంపై డాక్టర్ తనూజ, సోషల్ మీడియా ప్రభావంపై డాక్టర్ వసుధారాణి, ఆపత్కర సమయంలో స్వీయ రక్షణపై డాక్టర్ లక్ష్మీ సౌజన్యలు వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామకృష్ణ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అల్లర్లకు పాల్పడితే చర్యలు'

గడివేముల, ఆగస్టు 20: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డిలు హెచ్చరించారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన పెసరవాయిలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు చేతికొచ్చే వరకు సహకరించాలి: ఆర్డీవో

మిడుతూరు, ఆగస్టు 20: ప్రస్తుతం సాగు చేసిన పంటలు చేతికొచ్చే దాకా అన్ని గ్రామాల రైతులు సహకరించాలని ఆర్డీవో దాసు రైతులను కోరారు. మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో మద్దిగుండం చెరువు నీటి సమస్యపై జలకనూరు, సుంకేసుల, చింతలపల్లి గ్రామాల రైతులతో ఆర్డీవోతో పాటు విద్యుత్ ఈఈ జయశంకర్, మైనర్ ఇరిగేషన్ డీఈ రఘురామిరెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ మద్దిగుడం చెరువు నీటి సమస్యను పరిష్కరించాలని జలకనూరు, సుంకేసుల, చింతలపల్లి గ్రామాల రైతులు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చారని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇరు గ్రామాల రైతులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. వారికి ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు చేతికి వచ్చేవరకు ఇరుగ్రామాల రైతులు మద్దిగుడం చెరువు నీటిని వాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం చెరువు కింద సాగులో ఉన్న పంటల వరకు నీటిని వాడుకోవడానికి ఇరుగ్రామాల రైతులతో ఒప్పంద పత్రాలపై అధికారులు సంతకాలు చేయించుకున్నారు. చెరువు తూముల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరు అయిన వెంటనే చెరువు నీరు వృథా కాకుండా తూములకు మరమ్మతులు చేయిస్తామని ఇరిగేషన్ డీఈ రఘురామిరెడ్డి అన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ చెరువు నీటి కోసం గొడవలు పడకుండా గ్రామాల్లో రైతులు శాంతియుతంగా, సామరస్యంగా మెలగాలని సూచించారు. అనంతరం జలకనూరు మద్దిగుండం చెరువును ఆర్డీవో పాటు అధికారులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ శ్రీనివాసులు, నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఏఈ క్రాంతికుమార్, మైనర్ ఇరిగేషన్ ఏఈ రామ్మోహన్ రెడ్డి, ఎస్ఐ ఓబులేసు, ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశమైన ఆర్డీవో

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఆగస్టు 20: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని అర్చకులు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళహారతులు ఇచ్చారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల కల్చరల్, ఆగస్టు 20: నంద్యాల గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ అమ్మవారికి మంగళవారం అత్యంత వైభవంగా అలకంరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు, అర్చనలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి 108 వెండి పుష్పాలచే అలంకరించి ప్రత్యేక పూజలు, అష్టదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. అనంతరం హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఆగస్టు 20: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం వనపర్తికి చెందిన అభినయ కల్చరల్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మూషికవాహన, శశక్తి శ్లోకం, శివపంచాక్షరి, శివాష్టకం, ఓం నమఃశివాయ, భో..శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్యాలను ప్రదర్శించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు హిమబిందు

శ్రీశైలం, ఆగస్టు 20: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద పథకానికి ఈస్ట్ గోదావరికి చెందిన కె. నాగిరెడ్డి అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతలు ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతలను దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్ర పటం, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గడివేముల, ఆగస్టు 20: సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో జరిగిన జూనియర్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో కరిమద్దెల హైస్కూల్ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బాల వెంకటేశ్వర్లు తెలిపారు. హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మోహిని 46వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జూనియర్ పోటీలలో సిల్వర్‌మెడల్, ప్రశంసా పత్రాన్ని సాధించిందని తెలిపారు. మోహినిని గ్రామ టీడీపీ నాయకులు రాంభూపాల్ రెడ్డి, చంద్రారెడ్డి అభినందించారు. ఎస్వీ రామచంద్రారెడ్డి పేరుమీద రూ.5 వేలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్‌ను అందజేశారు.

సీఎంపై నమ్మకంతో రాష్ట్రానికి పెట్టుబడులు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



టీడీపీ కేంద్ర కార్యాలయంలో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, ఆగస్టు 20: సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యే కోట్లకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా పోవడానికి మాజీ సీయం జగన్ నియంతృత్వ పోకడలే అన్నారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు విదేశీ సంస్థలు వస్తున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారన్నారు. డోన్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి

కోవెలకుంట్ల, ఆగస్టు 20: ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి బీఎల్‌వోలకు సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబరు 18 వరకు గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలన్నారు. పేర్లు మార్పులు, చేర్పులు, చనిపోయిన వారిని తొలగించడం వంటివి తప్పులు లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఆర్ఓలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యాపిలి, ఆగస్టు 20: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ బాటనీ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. నెలకు రూ.10వేలు వేతనం అందిస్తామన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. అర్హత ఉన్న వారు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, 26న ఇంటర్వ్యూ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలీసు వాహనంలో క్షతగాత్రుల తరలింపు

సంజామల, ఆగస్టు 20: రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఎస్ఐ రమణయ్య పోలీసు వాహనంలో కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మంగళవారం సాయంత్రం కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ముజీబ్, చిన్న పెద్దయ్య ఆకుమళ్లకు వెళ్లి తిరిగి కోవెలకుంట్లకు వస్తుండగా ముదిగేడు సబ్ స్టేషన్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ఎస్.ఐ రమణయ్య పోలీసు వాహనాన్ని ఆపి ప్రమాద విషయాన్ని తెలుసుకొని 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు అంబులెన్స్ వారు వేరే ప్రాంతంలో ఉన్నాము గంట సమయం పడుతుందంటే వెంటనే పోలీసులు స్థానికుల సాయంతో క్షతగాత్రులను తమ వాహనంలోకి తీసుకొని కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం

కొలిమిగుండ్ల, ఆగస్టు 20: ఎపీఎంఎస్ఎస్‌టీయూ నూతన నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా కొలిమిగుండ్ల మోడల్ స్కూల్ ఇంగ్లీషు సబ్జెక్టు అధ్యాపకుడు వై.గోవిందు ఎన్నికయ్యారు. నంద్యాలలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏపీ మోడల్‌స్కూల్ సిబ్బందికి ప్రభుత్వంచే 010 పద్దు ద్వారా జీతాలు తీసుకరావడంలో తీవ్ర కృషి చేసిన గోవిందును ఎన్నుకున్నారు. మంగళవారం కొలిమిగుండ్ల ఏపీ మోడల్‌స్కూల్‌లో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, వైస్ పిన్సిపాల్ రాముడు, ఉపాధ్యాయులు గోవిందును ఘనం గా సన్మానించారు.

అవగాహనతో హెచ్ఐవీ నిర్మూలన

డోన్(రూరల్), ఆగస్టు 20: సంపూర్ణ అవగాహనతో హెచ్ఐవీ నిర్మూలన సాధ్యపడుతుందని డోన్ తహసీల్దార్ నాగమణి అన్నారు. మంగళవారం హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా శీర్షికతో కలిగిన పోస్టర్‌ను తహసీల్దార్ విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ ఈఎం మధుకుమార్, సభ్యులు సరస్వతి, షాజహాన్, సోఫియా, రాజేశ్వరి, వనితి పాల్గొన్నారు.

సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలి

డోన్(రూరల్), ఆగస్టు 20: వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులు త్వరితగతిన సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలని కోఆపరేటివ్ సొసైటీ సీఈవో వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు రెన్యువల్ చేసుకునేందుకు ఆధార్, పాన్‌కార్డులు పట్టాదారు పాసు పుస్తకాలతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్ఎం ఆదిలక్ష్మమ్మ

దొర్నిపాడు, ఆగస్టు 20: మండలంలోని భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్ఎం ఆదిలక్ష్మమ్మ తెలిపారు. ఈనెల 17 నుంచి 18వ తేదీ వరకు కదిరిలో నిర్వహించిన 46వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర, బాలికల హ్యాండ్‌బాల్ విభాగంలో నంద్యాల జిల్లా విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. ఈ పోటీల్లో భాగ్యనగరం ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, సులోచన, సుకన్య, మేరి పాల్గొన్నారు. ఈ విద్యార్థినులను, పీఈటీ శ్రీధర్‌ను మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, గంగాధర్, సురేష్‌బాబు, నాగరాజు, వహిద పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కూల్చివేతకు గురైన ఇల్లు

అవుకు, ఆగస్టు 20: అవుకు మండలం శివవరం గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మించిన ఇంటిని రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈ విషయంలో శివవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వ్యాపర్ల చిన్న సుబ్బారెడ్డి, గుత్తి లలితమ్మ కటకటాల పాలయ్యారు. ఉదయం బనగానపల్లె సీఐ మంజునాథరెడ్డి, తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, అవుకు, నందివర్గం ఎస్ఐలు రాజారెడ్డి, బీటీ వెంకటసుబ్బయ్య పోలీస్ సిబ్బందితో శివవరం గ్రామానికి చేరుకొని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇంటిని ఎక్సకవేటర్‌తో కూలగొట్టారు. శివవరం గ్రామానికి చెందిన చిన్న సుబ్బారెడ్డి 2023 మే 16న గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్‌బాబు సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. తన ఇంట్లో పని మనిషి గుత్తి లలితమ్మ పేరుతో నకిలీ ఇంటి పట్టా సృష్టించి ఎస్సీ కాలనీలోని మహిళల సామూహిక మరుగుదొడ్డిని కూల్చి ఏకంగా ఇంటిని నిర్మించాడు. ఈ ఏడాది జూన్ నెల 21వతేదీన ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద నీళ్ల చెంబులతో నిరసనకు దిగారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఇరువర్గాల మహిళలను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ ప్రసాద్‌బాబు తన సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం పోలీసులు వ్యాపర్ల చిన్న సుబ్బారెడ్డి, గుత్తి లలితమ్మపై కేసు నమోదు చేసి ఈనెల 17న ఇరువురిని రిమాండ్‌కు తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'



చాగలమర్రిలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు



ప్యాపిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి, ఆగస్టు 20: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల స్పెషల్ ఆఫీసర్, ఏడీ వరప్రసాద్ సూచించారు. మండలంలోని డి.వనిపెంట చెంచుగూడెంలో మంగళవారం ఇంటింటికి వెళ్లి వ్యాధుల నివారణపై చెంచులకు అవగాహన కల్పించారు. ప్రపంచ దోమల నివారణ సందర్భంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో కృష్ణమ్మ, ఏఎన్ఎం సంధ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

- దోమలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అంజలి తెలిపారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ చేశారు. హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలని ప్రజలకు సూచించారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వేస్ట్ ఆయిల్‌ను పంచాయతీ అధికారులు చల్లించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమలు కుట్టకుండా దుస్తులను నిండుగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్, ఫార్మసిస్ట్ మహేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి: దోమకాటు ప్రమాదకరమని వైద్యాధికారి నితీష్ అన్నారు. మంగళవారం పట్టణంలో దోమల దినోత్సవాన్ని పురస్కరించు కొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమకాటును నిర్లక్ష్యం చేస్తే మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలుతా యన్నారు. కార్యక్రమంలో సిబ్బంది విజయకుమారి, గంగాభవానీ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు అన్నారు. మండలంలోని టంగుటూరు పీహెచ్‌సీ పరిధిలోని అప్పలాపురం గ్రామంలో డాక్టర్ శివశంక రుడు ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వ హించారు. ప్రజలకు దోమలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అప్పలాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పోషకాహారాం గురించి పలు సూచనలు చేశారు. గర్భిణులు, డయాబెటీస్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జి.సరస్వతి, సూపర్ వైజర్ అయ్యమ్మ, సీహెచ్‌వో చార్మిల, ఏఎన్ఎం అబీద, ఉపాధ్యాయులు, 104 సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానం

సార్క్ దేశాల ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ కింజాంగ్



కటికవానికుంటలో కంది, కొర్ర అంతర సాగు పంటలను పరిశీలిస్తున్న డాక్టర్ కింజాంగ్

బనగానపల్లె, ఆగస్టు 20: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవరచుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సార్క్ దేశాల ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ కింజాంగ్ అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణ శివారులోని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు కెవికె తరపున పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కింజాంగ్ వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలు అవలంబిస్తున్న రైతుల అనుభవాలను నేరుగా పంట పొలాలను సందర్శించి తెలుసుకున్నారు. కొర్ర, కంది పంటల అంతర సాగును, వాటి వల్ల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు కటికవానికుంట, చెర్లోకొత్తూరు గ్రామాల్లో చేపట్టిన నీటి కుంటలను ఆయన సందర్శించారు. నీటికుంటల వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. పెరటికోళ్ల పెంపకంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మహిళకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ మెట్ట పరిశోధన కోఆర్డినేటర్ డాక్టర్ జెవిఎస్ఎస్ ప్రసాద్, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ధనలక్ష్మి, సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేశ్, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



మాట్లాడుతున్న సీఐ కంబగిరి రాముడు

చాగలమర్రి, ఆగస్టు 20: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు సూచించారు. మంగళవారం సాయంత్రం చాగలమర్రి కస్తూర్బా పాఠశాల, కళాశాలకు చెందిన బాలికలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఎస్ఐ రమేష్‌రెడ్డి, ఎస్‌వో సునిత, ఉపాధ్యాయినులు ఉన్నారు.

'యువకులకు కౌన్సెలింగ్'

ఆళ్లగడ్డ, ఆగస్టు 20: యువకులు చెడుబాటలో నడవకూడదని ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న యువకులను అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో ట్రాఫిక్ కష్టాలు



రోడ్డుపై నిలిపిన వాహనాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 20: కొలిమిగుండ్లలో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. చిరు వ్యాపారులు, వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. పట్టణంలోని ప్రధాన రహదారిని ఇటీవల విస్తరించినప్పటికీ, చిరు వ్యాపారులు సీసీ రోడ్డుపైకి చొచ్చుకొని వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొందరు వాహనదారులు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్న కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. మంగళవారం వారపు సంత రోజు మార్కెట్ నిర్వహణతో వాహనదారులకు, ప్రజలకు మరిన్ని కష్టాలు తప్పడంలేదు. సాయంత్రం సమయంలో రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

చాగలమర్రి, ఆగస్టు 20: మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వి.సంజీవరెడ్డి (70) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. నాయకుడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, నరేంద్రారెడ్డి, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, గురుశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, ఆగస్టు 20: గ్రామాల్లో రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ సూచించారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పరిహారం అందుతుందన్నారు. ఏఈవోలు పాల్గొన్నారు.

'మట్కాపై ప్రత్యేక నిఘా'

చాగలమర్రి, ఆగస్టు 20: గ్రామాల్లో మట్కా, జూదం, అక్రమ మద్యంపై పోలీసు ప్రత్యేక నిఘా ఉంటుందని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు అన్నారు. మంగళవారం చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసు చర్యలు తప్పవని అన్నారు. శాంతియుత జీవనం సాగించి ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

చాగలమర్రి/ కొలిమిగుండ్ల, ఆగస్టు 20: నంద్యాల జిల్లాలో వేర్వేరు చోట్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. చాగలమర్రి మండలం కేపీ తండా గ్రామానికి చెందిన మూడె చిన్న బుక్కెనాయక్ (80) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈనెల 14న బుక్కెనాయక్ అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన తన నివాసంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విష యం తెలుసుకున్న కుటుంబీకులు ప్రొద్దుటూరు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. కోలుకోలేక మృతి చెందాడని ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. అలాగే కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలో చిన్నరంగయ్య(62) అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధులు పెరిగిన కారణంగా జీవితంపై విరక్తి చెంది, సోమవారం ఇంట్లో ఎవ్వరూలేని సమ యంలో చిన్నరంగయ్య విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొలిమిగుండ్ల, అక్కడి నుంచి అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

ప్యాపిలి, ఆగస్టు 20: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రక్త గ్రూపు తెలుసుకోవడం వల్ల అవసరమైన వారికి రక్తదానం చేయవచ్చని అన్నారు. అధ్యాపకులు నవీన్‌పాటి, రామక్రిష్ణయ్య, సత్యబాబు, వెంకట రమణ పాల్గొన్నారు.

'నిందితులను శిక్షించాలి'



ఆళ్లగడ్డలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు



బనగానపల్లెలో..

ఆళ్లగడ్డ, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ శివరామయ్య ఆధ్వర్యంలో మంగళవారం కొవ్వొత్తులతో కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. సేవ్ ఇండియా సేవ్ ఉమెన్ నినాదాలు చేశారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకొని రావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వారు కోరారు. కార్యక్రమలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనపై నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మంగళవారం సాయంత్రం కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, పట్టణ అర్బన్ కేంద్రం డాక్టర్లు వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించి పాతబస్టాండు గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కే.చంద్రశేఖర్, పీహెచ్‌సీ, పట్టణ వైద్యులు రామభూపాల్, శ్రీకాంత్, తబాజ్, ఆశాలు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

- **నిందితుల దిష్టిబొమ్మ దహనం:** కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌ను హత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని సీపీఐ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో డోన్ పాతబస్టాండు గాంధీ విగ్రహం వద్ద నిందితుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, ఏపీ మహిళా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీమ్ బేగం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

బనగానపల్లె: దేశంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టి రక్షణ కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి కోరారు. మంగళవారం కలకత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం, ముచ్చుమర్రిలో బాలికపై హత్యాచారం, దేశంలో వివిధ ప్రాంతాల్లో బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా బనగానపల్లె పట్టణంలో ఏపీటీఫ్, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, సుబ్బరాయుడు, వెంకటకృష్ణుడు, గోవింద్ నాయక్, పోలియానాయక్, రమేశ్, సుంకన్న వీరన్న, కిశోర్, రఫీ, చాంద్ బాషా, శేఖర్, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు: సీఐ

బనగానపల్లె, ఆగస్టు 20: బనగానపల్లె పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సీఐ కృష్ణయ్యయాదవ్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని పొట్టిశ్రీరాముల కూడలి, పాతబస్టాండ్, సీఐ కార్యాలయం, ఆస్థానంరోడ్డు, జీఎం టాకీస్, పెట్రోల్‌బంకు కూడలి, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు, ఆటోవాలాలకు, డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. అలాగే వ్యాపారులు కూడా ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు.

విద్యార్థినులను కన్నబిడ్డల్లా చూసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ హనుమంత నాయక్

కోవెలకుంట్ల, ఆగస్టు 20: సుదూర ప్రాంతాల నుంచి చదువుకోవడానికి హాస్టల్‌కు వచ్చిన పేద విద్యార్థినులను సంరక్షకులు సిబ్బంది కన్నబిడ్డల్లా చూసుకోవాలని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని వెలగటూరు రహదారిలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో సీఐ, ఎస్ఐ మల్లికార్జునరెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవ గాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థినులు ఇష్టంగా చదవి మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు.

రెడీమేడ్ వంతెన ఏర్పాటు

వాహనాల రాకపోకలకు అంతరాయం

సంజామల, ఆగస్టు 20: రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేలైన్ మార్గంలో రెడ్డిపల్లె సమీపంలో రెడీమేడ్ వంతెనను మంగళవారం ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రామ్‌కో యాజమాన్యం ముందస్తు సమాచారం ఇవ్వకుండా కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకుండా రెడీమేడ్ వంతెన క్రేన్ ద్వార ఏర్పాటు చేయడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేరుసోమలకు, తాడిపత్రికి వెళ్లాల్సిన వారు సంజామల మీదుగా అవుకు, ఆకుమళ్ల మీదుగా ప్రయాణం సాగించారు.

నత్తనడకన అండర్ బ్రిడ్జి పనులు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



వెంకటనాయునిపల్లె వద్ద జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులు

డోన్(రూరల్), ఆగస్టు 20: పట్టణ సమీపంలోని వెంకటనాయునిపల్లె గ్రామం మీదుగా వెళ్లే ప్రధాన రహదారిలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు నత్తనడకన జరుగుతుండటంతో ఆ గ్రామాల మీదుగా పట్టణానికి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలల క్రితం పట్టణ సమీపంలో ప్రధాన రహదారి మీదుగా వెళ్లిన రైల్వే గేట్ల కింద అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యాయి. అయితే పనుల్లో వేగవంతం లేకపోవడంతో వెంకటనాయునిపల్లె గ్రామం మీదుగా వెళ్లే గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డోన్ పట్టణం నుంచి 4 కి.మీల దూరంలో ఉన్న వెంకటనాయునిపల్లె గ్రామం మీదుగా కామగానిగుంట్ల, తిమ్మాపురం, ఆవులదొడ్డి, గోవర్ధ గిరి తదితర గ్రామాలున్నాయి. రైతులు తమ వ్యవసాయ పంటల ఉత్పత్తులను ట్రాక్టర్ల ద్వారా తరలిచాలన్నా వెంకటనాయునిపల్లె గ్రామం రైల్వేగేట్ల మీదుగా వెళ్లాల్సి వస్తుంది. అయితే.. రైల్వేగేట్ల అండర్ బ్రిడ్జి పనుల వల్ల ప్రత్యామ్నాయ మార్గం సరిగ్గా లేకపోవడంతో రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంకటనాయునిపల్లె గ్రామం నుంచి డోన్‌లోకి రావాలన్నా పొలాల మధ్య నుంచి బండ్ల రస్తా నుంచి డోన్‌కు చేరుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



రైల్వే అండర్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. పనుల్లో వేగవంతం లేకపోవడంతో రైతులు, వాహనదారులు రాకపోకలల్లో తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

- సీలం చంద్రశేఖర్ నాయుడు, సర్పంచ్, వెంకటనాయునిపల్లె